## అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్, జెసిబిలు పట్టివేత

**కేశంపేట, మే 5, ప్రభాతవార్త:** కేశంపేట మండల పరిధిలోని వేముల్‌నర్వ చెరువు నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న జెసిబి టిప్పర్లను పట్టుకున్నట్లు ఎస్సై కుప్పగిరి లింగం తెలిపారు. వేముల్ నర్వ గ్రామ శివా రులో గల కోమటి చెరువులో నుంచి ఏలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న టిప్పర్ జెసిబిలను పట్టుకుని టిప్పర్ డ్రైవర్ కొమురయ్య జెసిబి డ్రైవర్ పవన్ మరియు జేసిబి టిప్పర్ యజ మానులపై కానిస్టేబుల్ రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేస్తుకున్న టిప్పరు, జెసిబి



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

## భానుడి సెగకు పగిలిన కారు అద్దాలు

**చేవెళ్ల, మే 5 ప్రభాతవార్త :** ఎండాకాలంలో ఎండ తీవ్రత ఎక్కువ ఉన్నప్పుడు రోకలి బండలు పగిలేలా ఎండలు కాస్తున్నాయని సంభోదిస్తుంటాం. ఎండ వేడిమికి పగిలిన బండలను చూడ డం, అరుదే.. కాని కొన్ని రోజులుగా బండలు పగిలి ఎండలు కాస్తున్నాయని మాత్రం చెప్పవ చ్చు. చేవెళ్ల మండల పరిధిలోని ఇబ్రహీంపల్లి వాస్తవ్యు లు అహ్మద్ కారు ఎండ వేడిమి, 46డిగ్రీల ఉష్ణోగ్రత తీవ్రతకు అద్దాలు పగిలాయి. మధ్యా హ్నం కావడంతో జనసంచారం లేకపోవడం వల్ల ఎవరికి ప్రమాదం జరగలేదని స్థానికులు తెలిపారు.



కారు అద్దాలు పగిలిన దృశ్యం



కందనెల్లిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకులు, కలెక్టర్

## ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలి : రాజేంద్రకుమార్

**పెద్దేముల్, మే 5, ప్రభాతవార్త:** పార్లమెంటు ఎన్నికలను పురస్కరించుకొని తాండూరు నియెజకవర్గం పెద్దేముల్ మండలంలోని కందనెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని మూడు పోలింగ్ కేంద్రాలను చేవెళ్ళ పార్లమెంటు ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేంద్రకుమార్ కటారియా, జిల్లా కలెక్టర్‌సి. నారాయన్‌రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హరతిలతో కలిసి ఆదివారం పరిశీలించారు. పోలింగ్‌కేంద్రాల లోని ఓటర్ల వివరా లను అడిగి తెలుసుకున్నారు. డబుల్ ఓట్లపై ఆరా తీశారు. పోలింగ్ కేంద్రాల అవరణలో ఉన్న టాయిలెట్స్‌ని పరిశీలించి నీటి సరఫరాపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజేంద్ర కుమార్ మాట్లాడుతూ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలోతాండూరు డివిజన్ పంచాయతీ అధికారి శంకర్ నాయక్, మండల తహసిల్దార్ కిషన్, బూత్ స్థాయి అధికారులు, గ్రామ కార్యదర్శి తదితరులు ఉన్నారు.

## పిడుగుపాటుకు మహిళా మృతి

**ఆమనగల్లు, మే 5 ప్రభాతవార్త:** ఆమనగల్లు పట్టణ సమీపంలో పిడుగు పడి ఓ మహిళా రైతు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పట్టణంలోని శ్రీకాంత్ కాలనికి చెందిన కావటి లక్ష్మమ్మ (45) గుర్రం గుట్ట వెనుకాల ఉన్న తన వ్యవసాయ క్షేత్రంలో పొలం పనులు చేస్తుండగా ఆదివారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షంలో పిడుగు పాటుకు గురైంది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందినది. లక్ష్మమ్మ మృతితో ఆమె కుటుంబంలో విషాధచాయలు అలుముకున్నాయి.

## పార్లమెంట్ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

### పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించిన ఎన్నికల పరిశీలకులు



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న సాధారణ ఎన్నికల పరిశీలకులు

**తాండూరు, మే 1, ప్రభాతవార్త :** పార్లమెంట్ ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు చేవెళ్ల పార్లమెంటరీ ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేంద్ర కుమార్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని ఆదివారం చేవెళ్ల పార్లమెంటరీ ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేంద్రకుమార్ కటారియా తాండూరు నియోజకవర్గంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతిలతో కలిసి పర్యటించారు. ముందుగా పెద్దేముల్ మండలం కందనెల్లి, యా లాల మండలం రాజీవ్ కాలనీ, తాండూరు పట్టణంలోని సాయిపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఉన్న పోలింగ్ కేంద్రాలను, ఫెసిలిటేషన్ కేంద్రంలో జరుగుతున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ విధానాన్ని పరిశీలించారు. అనంతరం పట్టణంలోని సెంట్‌మార్క్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో స్ట్రాంగ్ రూమును సందర్శించి ఈవీఎం కమిషనింగ్ ప్రక్రియ నిర్వాహణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిదంగా డబల్ ఓట్ల వివరాలు వాటిపై తీసు కుంటున్న చర్యలు, ఓటర్ స్లిప్పుల పంపిణీపై పరిశీలకులు బిఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో తాండూరు నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి శ్రీనివాసరావు, తహసిల్దారులు తారాసింగ్, కిషన్, డివిజనల్ పంచాయితీ అధికారి పరిశీలకుల లైసెన్ ఆఫీసర్ శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కేడర్‌ల ఎంపిక జాబితా వెబ్‌సైట్‌లో ఏర్పాటు

### ఎంపికైన అభ్యర్థులు సర్టిఫికెట్ల పత్రాలతో నేడు డిఎంఅండ్‌హెచ్‌ఓ ఆఫీస్‌కు హాజరు కావాలి

### డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రఘునాధస్వామి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 5, ప్రభాతవార్త**

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కుత్బుల్లాపూర్ ప్రభుత్వ వైద్య కళాశాలలో వివిధ కేడర్‌ల కోసం ధరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు వారి తుది మెరిట్, సెలక్షన్ జాబితాను వెబ్‌సైట్‌లో ఏర్పాటు చేసినట్లు, ఎంపికైన అభ్యర్థులు ఈ నెల 6న సోమవారం ఉదయం 11గంటలకు సర్టిఫికెట్ల పత్రాలతో మేడ్చల్ జిల్లా డిఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంకు హాజరు కావాలని మేడ్చల్ జిల్లా డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రఘునాధస్వామి కోరారు. వివిధ పోస్టుల కోసం ధరఖాస్తులు చేసుకున్న వారి తుది మెరిట్ ఎంపికైన వారి జాబితాను వెబ్‌సైట్‌లో హెచ్‌టిటిపిఎస్:// మేడ్చల్-మల్కాజ్‌గిరి. తెలంగాణ జిఓవి. ఇన్/ అప్‌లోడ్ చేయబడినట్లు ఆయన వివరించారు. ఎంపికైన అభ్యర్థులు డిఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంకు సోమవారం ఉదయం 11గంటలకు సర్టిఫికెట్ల పత్రాలతో హాజరు కావాలని ఆయన సూచించారు.

# 111 జీవో అక్రమ నిర్మాణాల్లో ఎవరి వాటా వారిదే

**హిమాయత్‌నగర్ రెవెన్యూలో వందల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు**
**గ్రామ కార్యదర్శులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం**
**సర్పంచులు లేరని అదునుగా మార్చుకున్న కార్యదర్శి, పంచాయతీ అధికారులు**
**ప్రత్యేక అధికారులున్నా అక్రమ నిర్మాణాలలో మారనితీరు**



మండలంలోని హిమాయత్‌నగర్ కామారవెల్లిలో పద్మావతి వెంచర్లో ఇష్టాను సారంగా కట్టడం చేస్తున్న దృశ్యం

**మొయినాబాద్, మే 5, ప్రభాతవార్త:** మొయినాబాద్ మండలంలోని హిమాయత్‌నగర్ గ్రామ రెవెన్యూలో వందల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు చేపడుతుంటే కళ్లు మూసుకున్నట్లు మాకు సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారు. గ్రామాల్లో సర్పంచుల పదవీకాలం పూర్తవగానే పూర్తి సర్వాధికారాలు గ్రామ సర్పంచులకు లేకుండా గ్రామ కార్యదర్శులకు మాత్రమే ఉన్నాయి. ఇదే అదునుగా చేసుకుని కొంత మంది అక్రమ నిర్మాణాల జోరుగా సాగిస్తున్నారు. మండలంలోని హిమాయత్‌నగర్ గ్రామ రెవెన్యూలో పద్మావతి వెంచర్‌లో అక్రమ నిర్మాణాలు ఆకాశాన్ని తలదన్నే విధంగా చేపడుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేస్తుంటే అందినకాడికి దండుకుని నాకేం తెలియదు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు గ్రామ సెక్రెటరీ. పలువురు అక్రమ నిర్మాణాలపై గ్రామ కార్యదర్శికి ఫిర్యాదు చేసి నెలలు గడుస్తున్నా ఎలాంటిం స్పందన లేదు. నాకేం తెలియదు నాకు సంబంధం లేదు అన్నట్లుగా వివరిస్తున్నట్లు స్థానికులు చెప్తున్నారు. 111 జీవోలో అనుమతులు లేకుండా ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదు. అలాంటిది వందల సంఖ్యలో ఆరు నుంచి ఏడు అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారు. శరవేగంగా నిర్మాణాలు చేపట్టి బయటి భాగం పూర్తిగా రంగులు అద్దేసి లోపలి భాగంలో పనులు కొనసాగిస్తున్నారు. బయటి భాగం పెయింట్ వేయడంతో పూర్తి నిర్మాణం అయిపోయింది. మేమేం చేయలేము అని కార్యదర్శులు పంచాయతీ అధికారులు చేతులెత్తేస్తున్నారు. అసలు అనుమతులు లేకుండా నిర్మించినటువంటి నిర్మాణాలను కూల్చి వేయాల్సిన అధికారులే నిర్మాణం పూర్తయినంతవరకు తూతూ మంత్రంగా నోటీసులు జారీచేసి వారి వద్ద నుంచి డబ్బులు వసూలు చేసి రంగులు పడేంత వరకు మౌనంగా ఉంటున్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే నోటీసులు ఇచ్చాం కలుస్తా మంటూ కాలం వెల్లదీస్తున్నారు. ఈ విషయం పట్ల పైఅధికారులు స్పందించాలని మండలంలోని హిమాయత్‌నగర్ గ్రామస్తులు వాపోతున్నారు. అక్రమ నిర్మాణాలతో పచ్చని పంట పొలాలు నాశనం చేస్తూ పర్యా వరణానికి తూట్లు పొడుస్తుంటే ఏమీ పట్టనట్లుగా పంచాయతీ అధికారులు నోరు మెదపక పోవడం చర్యలు తీసుకోకపోవడం పట్ల స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నిత్యం అక్రమ నిర్మాణాలతో పెద్దపెద్ద టిప్పర్లు, లారీలు మొరం, మట్టి హైదరాబాద్ నగరం నుంచి అతివేగంగా టాస్కార్లతో తీసుకువస్తూ గ్రామాలలో కోట్ల రూపాయలు పెట్టి వేసినటువంటి రోడ్లు ఎక్కడికి అక్కడ పగిలిపోతున్నాయి. మొయినాబాద్ మండలంలోని హిమాయత్‌నగర్ చిలుకూరు కనమామిడి రెవెన్యూలో పెద్దపెద్ద విల్లాలు వేలగజాలలో కన్వెన్షన్ల పేరుతో ఎకరాల కొద్ది నిర్మాణాలు, రైతులకు ఇబ్బందిగా ఉండేటట్లు ప్రహరీ గోడ నిర్మాణాలు చేపడుతున్నారు. అయినా అధికారులు స్పందించడంలేదు. చిలుకూరు రెవెన్యూలో బీజాపూర్ హైవేకు ఆనుకుని 20 నుంచి 30ఫీట్ల లోతు గోతులు తవ్వి అందులో నుంచి నిర్మాణాలు చేస్తున్నా పలుమార్లు కార్యదర్శులకు పై అధికారులకు ఫిర్యాదు లుచేసినా ఇప్పటి వరకు ఆపడానికి ప్రయత్నించిన దాఖలాలు కనిపించలేదు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



చిలుకూరు రెవెన్యూ బీజాపూర్ రహదారికి ఆనుకుని అండర్‌గ్రౌండ్ తవ్వి మరి నిర్మాణాలు చేపడుతున్న దృశ్యం



అధికారులతో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు

## పారదర్శకంగా ఎన్నికల నిర్వహించేలా చర్యలు తీసుకోవాలి

### -ఎన్నికల పరిశీలకులు త్సావాంగ్గాచో భూటియా

**కొడంగల్, మే 5ప్రభాతవార్త** పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అలసత్వం లేకుండా పారదర్శంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఎన్నికల పరిశీలకులు ఐఎఎస్ అధికారి సూచించారు. ఆదివారం మహబుబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని కొడంగల్ నియోజకవర్గానికి సంభందించి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎం గోడౌన్‌ను అసిస్టేంట్ రిటర్నింగ్ అధికారి లింగ్యానాయక్‌తో కలిసి సందర్శించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ కేంద్రంతో పాటు ఈవీఎం కమీషనింగ్ జరుగుతున్న తీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. కార్య క్రమంలో కొడంగల్, కోస్గి, దుద్యాల్, మద్దూర్, కొత్తపల్లి, గుండుమాల్ తహశీల్దార్‌లు విజయ్‌కుమార్, శ్రీని వాస్, దానయ్య, మహేష్‌గౌడ్, అనిల్‌కుమార్, ఆనంద్‌లతో పాటు సెక్టోరియల్ అధికారులు, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

## క్రీడలలో గెలుపు, ఓటమిలు సహజం



క్రీడాకారులకు ట్రోఫీని అందజేసిన ఎంపీపీ

**కొత్తూర్, మే 5, ప్రభాతవార్త :** క్రీడలలో గెలుపు ఓటమి సహజమని, నేడు ఓటమి రేపటి గెలుపుకు పునాది అని ఎంపీపీ పిన్నింటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం కొత్తూర్ మండలంలోని గూడూరు గ్రామంలో ఏర్పాటు చేసిన గూడూరు ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు ఎంపీపీ పిని ్నంటి మధుసూదన్‌రెడ్డి బహుమతులు అందజేశారు. టోర్నీలో మొదటి బహుమతి పొందిన టీం గూడూరు జూనియర్స్ టీం విన్నర్ ట్రోపీతో పాటు రూ.10వేల నగదు బహుమతి, రన్నర్ టీం మక్తగూడ ఎంకే క్రికెట్ వారియర్స్ టీం ట్రోఫీతో పాటు రూ.5వేల నగదు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... క్రీడలలో గెలుపు ఓటమిలు సహాజమని, దీనిని ప్రతి ఒక్కరు కూడా ఓటమిని రేపటికి గెలుపుకు పునాదిగా భావించాలని సూచించారు. అదేవిధంగా క్రీడలను ప్రతి ఒక్కరు స్నేహభావంతో కలిసి ఉత్సాహపర్చుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో తాజా మాజీ సర్పంచులు బ్యా గరి సత్తయ్య, అంబటి ప్రభాకర్, కాట్న రాజు, రవినాయక్, ఉపసర్పం చులు దయానంద్‌గుపాత, దశరథ్‌నాయక్, నరసింహారెడ్డి, మాజీ ఎంపిటీసీ మోడీ దర్శన్, జయేందర్‌రెడ్డి, సిద్దుగౌడ్, శంకర్‌నాయక్, రవినాయక్, దయానంద్‌రెడ్డి, పద్మారావు, ఆంజనేయులుముదిరాజ్, శ్రీరాము లుగౌడ్, బోకుల రాజు, క్రీడాకారులు తదితరులు ఉన్నారు.

# అంగరంగ వైభవంగా చీర్యాల లక్ష్మీనృసింహ్మా స్వామి తిరుకళ్యాణం



చీర్యాల లక్ష్మీనృసింహ్మా స్వామి సేవలో రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**కీసర, మే5, ప్రభాతవార్త:** శ్రీచీర్యాల లక్ష్మీనృసింహ్మాస్వామి తిరుకళ్యాణ మహోత్సవం యాదాద్రి ప్రధాన అర్చకులు ఆద్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చరణల మద్య ఆలయ చైర్మన్ దంపతులు మల్లారపు ఇందిర లక్ష్మీనారాయణ చేతుల మీదుగా స్వామి వారి కళ్యాణ మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. నగరం నలుమూలల నుండి వేల సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారి తిరుకళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. స్వామివారి ఆలయంలో నిత్యవిధి కార్యక్రమాలు, నవకలశ అభిషేకం, నిత్య పూర్ణాహుతి, నివేదన, శాత్తుముత్రై, మంగళా శాసనము, తీర్ధ ప్రసాద గోష్టి, ఉదయం, సాయంత్రం శ్రీ సుదర్శన నారసింహ యాగం (హోమం) ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు తదితర కార్యక్రమాలు జరిగాయి. స్వామి వారి కళ్యాణం చూడటానికి వచ్చిన భక్తులకు లక్ష్మీనృసింహ్మా స్వామి చారిటబుల్ ట్రస్టు ఆద్వర్యంలో అన్నదానం నిర్వహించారు. భక్తుల కొరకు ఉచితంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈసిఐఎల్ సోలీస్ హస్పిటల్ ఆద్వర్యంలో భక్తులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేయడం జరిగింది.

### స్వామి వారి సేవలో ప్రముఖులు

చీర్యాల లక్ష్మీనృసింహ్మా స్వామి ఆలయంలో ఆదివారం జరిగిన స్వామి వారి తిరుకళ్యాణంలో ప్రముఖులు పాల్గొన్నారు. వీరికి ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ వేద పండితులతో కలిసి పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామి వారి శేష వస్త్రాలతో సన్మానించి, స్వామి వారి చిత్ర పటాన్ని అందజేశారు. తెలంగాణ రాష్ట్ర సినీ ఆటోగ్రఫీ, ఆర్అండ్‌బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ల్యాండ్ రెవెన్యూ రిజిస్ట్రేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్‌మిట్టల్, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్, రామగుండం ఎమ్మెల్యే మకన్‌సింగ్ రాజ్ ఠాకూర్ సతీమణి మనాలి, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా మాజీ కలెక్టర్ ఎంవిరెడ్డి తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు.

## ఓ వైపున ఎండల వేడి.. మరో వైపున రాజకీయ వేడి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 5, ప్రభాతవార్త**

ఓ వైపున ఎండలు..మరో వైపున రాజకీయం వేడి కొనసాగుతుంది. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో రోజురోజుకు విపరీత ఎండలతో ఎండలు భగ్గుమంటున్నాయి. ఎండలతో ప్రజలు అతలాకుతలం అవుతున్నారు. ఇళ్ల నుంచి ప్రజలు బయటకు వెళ్లాలంటేనే భయపడుతూ జంకుతున్నారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఎండల తీవ్రతతో ప్రజలు ఎండ వేడి భానుడి ప్రతాపంతో తల్లడిల్లి పోతున్నారు. నీడను వెతుకోవలసిన పరిస్థితితులు దాపురించాయి. ఎండలతో ప్రజలు దాహం, దాహర్తి కోసం తహతహలాడుతూ ఉన్నారు. గతంలో ఎన్నడు లేని విధంగ ఎండలు ఉండటంతో ప్రజలు ఇబ్బందులకు గురువుతున్నారు. మే నెలలో ఎండలు మరింత తీవ్రం కావటంతో పిల్లలు, వృద్దులు ఎండ వేడిని తట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. ఇదీ ఇలా ఉండగ ఎన్నికలు ఉండటంతో రాజకీయ వేడి కూడ రోజురోజుకు పుంజుకుంటుంది. ఈ నెల 13వ తేదీన పార్లమెంట్ ఎన్నికలు ఉండటంతో అభ్యర్థులు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేయటం జరుగుతున్నా..ఎండల తీవ్రతతో అటు ప్రజలు, ఇటు రాజకీయ నాయకులు కూడ భయబ్రాంతులకు గురవుతున్నారు. ఉదయం 6,7 గంటల నుంచి 10గంటల వరకు, సాయంత్రం 5గంటల నుంచి రాత్రి వరకు ప్రచారం నిర్వహిస్తున్నారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఎన్నికలు (పోలింగ్) ఈ నెల 13న జరుగుతున్నందున రాజకీయ పార్టీల అభ్యర్థులు, నాయకులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ర్యాలీలు, ఇంటింటి ప్రచారం, కార్నర్ మీటింగ్‌లు, సభలు నిర్వహిస్తూ ప్రజలను కలుస్తూ ఎన్నికల ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. మల్కాజ్‌గిరి ఎంపి ఎన్నికల్లో మాత్రం 22మంది అభ్యర్థులు పోటీలో ఉన్నప్పటికీ ప్రచారంలో మాత్రం బిజెపి, కాంగ్రెస్, బిఆర్ఎస్‌ల పోటీ కొనసాగుతున్నట్లు చెప్పవచ్చు. ఆయా పార్టీల అభ్యర్థులు, నాయకులు ఎన్నికల ప్రచారాన్ని తీవ్రంగ చేశారు. ఆయా పార్టీల నాయకులు పోటాపోటీన ప్రచారాలు చేస్తున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు బిఎస్‌పి, పలువురు రాజకీయ పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు కూడ ప్రచారం నిర్వహిస్తున్నారు. కొందరు నాయకులు, ప్రజాప్రతినిధులు ఎన్నికలు సమీపిస్తున్నప్పటికీ పార్టీలు మారుతున్నారు. ఈ ఎన్నికల్లో మాత్రం ఎండలతో వేడి తీవ్రంగ ఉంటే రాజకీయ వేడి ఓవైపున ఉంటే మరో వైపున ఎన్నికల ప్రచార హోరు వేడి కూడ కొనసాగుతూ ఉంది.

## ఘట్‌కేసర్, ఎదులాబాద్‌లో ఫ్లాగ్ మార్చ్

**ఘట్‌కేసర్, మే 5, ప్రభాతవార్త:** పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ సైదులు అన్నారు. ఎదులాబాద్, ఘట్‌కేసర్ పట్టణంలో ఆదివారం పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు మార్చ్ ఫ్లాగ్ నిర్వహించారు. ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ సైదులు, ఎస్ఐలు రామునాయక్, శ్రీకాంత్, శేఖర్‌తో పాటు సీఐఎస్ఎఫ్ బలగాలతో కలిసి పలు వీధుల్లో మార్చ్ జరిపారు. ఈ నెల 13న జరిగే ఎంపీ ఎన్నికల్లో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చి నిర్భయంగా ఓటు వేయాలని పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేస్తామని సీఐ పేర్కొన్నారు.

# భానుడి భగభగ

**మండుతున్న ఎండలకు సకల జీవులు తల్లిడిల్లుతున్నాయి. ఫ్యాన్లు, కూలర్లు ఏసీలు ఉన్నా ఎండ వేడిమికి భరించలేక ఇళ్లల్లో ఉండలేక ఇబ్బందుల పడుతున్నారు. కొంతమంది చల్లని పానీయాలు సేవించి సేద తీరుతున్నారు.**

**నవాబుపేట, మే 5, ప్రభాతవార్త** భానుడి ప్రతాపానికి ప్రజలు తల్లడిల్లుతున్నారు. దాదాపు 40 నుంచి 45 డిగ్రీల దాక నమోదవుతున్న ఉష్ణోగ్రతకు తట్టుకోలేక సేద తీరుటకు వివిధ రకాల ప్రత్యామ్నయ మార్గాలు ఎన్నుకుంటున్నారు. కొందరు చల్లని పానీయాలను సేవిస్తున్నారు. కొందరు చల్లని ప్రదేశాలను ఎన్నుకుని నీడనిచ్చే చెట్లవద్ద సేద తీరుతున్నారు. అదేవిధంగా బయటకు వెళ్లలేని వారు ఫ్యాన్లను, కూలర్లను వేసుకుని సేదతీరుతున్నారు. కొందరు వ్యవసాయ క్షేత్రాల వద్ద నున్న వ్యవసాయ బావులలో ఈదుతూ సేద తీరుతున్న తీరు కొనసాగుతున్నది. క్షణం విద్యుత్ సరఫరా నిలిచిపోతే ఉండలేని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ఆంధ్రప్రాంతం నుంచి వచ్చిన వారు ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన చల్లని ఫ్రూట్ సలాడ్ మజ్జిగ లస్సి బాదాం పాలు తదితర పానీయాలకు భలేగిరాకీ ఏర్పడింది. ఈ విధంగా కొందరు వేడిమిని తట్టుకోలేక ప్రత్యామ్నయంగా పానీయాలను సేవిస్తూ సేదతీరుతున్నారు. కొందరు మజ్జిగ బాటిళ్లను తమ వెంట తెచ్చుకుని అప్పుడప్పుడుసేవిస్తూ సేదదీరుతున్నారు. కొందరు కాటన్ టావాళ్లను తలకు చుట్టుకుని బయట



తిరుగుతున్నారు. ఈ విధంగా ప్రజలు ఎండ వేడిమి తట్టుకునేందుకు వివిధ రకాలుగా యత్నిస్తూ రోజులు వెళ్లదీస్తున్నారు. ఇదిలా ఉండగా అడవి జంతువులు పక్షులు తాగునీటి కోసం వేంపర్లాడుతున్నాయి. గతంలో వ్యవసాయ బావుల వద్ద సేద్యం కోసం కాల్వల ద్వారా బావి నుంచి నీటిని తోడే వారు. ఈ నేపథ్యంలో కాల్వవల్లో పారే నీటిని పక్షులు జంతువులు తాగేవి నేడు ఆ పరిస్థితి లేదు బిందుసేద్యం చేయడంతో నీరు బయట కనిపించడం లేదు. అంతేకాకుండా బోర్లు వేసి సేద్యం చేస్తున్న తరుణంలో వ్యవసాయ బావులు ఎండి పోయి పడావుపడ్డాయి. దీంతో కూడ బహీర్గతంగా నీటి నిల్వలు లేవు. చిన్నచిన్నకుంటలు వాగులు పూర్తి గా ఎండిపోయాయి. దీంతో అడవి జంతులకు పక్షులకు మంచినీటి సమస్య ఏర్పడింది. ఏదీ ఏమైనా భానుడి ప్రతాపానికి జీవులన్నీ తల్లడిల్లుతున్నాయి.

## రూల్స్ మీకే..

మాకు కాదు అని నిరూపించిన పోలీసులు

# కేబుల్ బ్రిడ్జిపై కేక్ కటింగ్

- నిబంధనలను అతిక్రమిస్తూ తీయని వేడుక
- వివాదంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు



కేబుల్ బ్రిడ్జిపై నిబంధనలను అతిక్రమిస్తూ పుట్టిన రోజు వేడుకలు జరుపుకుంటున్న సిఐలు

హైదరాబాద్, మే 5, ప్రభాతవార్త: దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జిపై పుట్టినరోజు వేడుకలు నిషేదిస్తూ గత నెల 16వ తేదీ నుంచీ ఆంక్షలు విధించిన పోలీసులు, ఇప్పుడు వాటిని ఉల్లంఘించి వివాదంలో చిక్కుకున్నారు. వివరాల్లోకెళ్తే, కేబుల్ బ్రిడ్జిపై వాహనాలు ఆపి, పుట్టినరోజు వేడుకలూ, కోలాహలాలూ, సంబరాలూ జరుపుకోకూడదని నిషేదించి, తగు నిబంధనల ప్రకటనలు జారీ చేసిన మాదాపూర్ సిఐ గడ్డం మల్లేష్ నిబంధనల ఉల్లంఘనకు పాల్పడుతూ అదే బ్రిడ్జిపై పుట్టినరోజు వేడుక నిర్వహించి కేక్ కటింగ్ చేశారు. ఈ వేడుకలో భాగంగా సిఐ గడ్డం మల్లేష్‌తో పాటూ, పటాన్‌చెరువు ట్రాఫిక్ సిఐ శ్రావణ్, రాజేంద్రనగర్ సీసీఎస్ సిఐ సంజయ్‌లు పాల్గొని నిబంధనలను అతిక్రమిస్తూ తీయని వేడుక చేసుకున్నారు. రూల్స్ ప్రజలకే గానీ తమకు వర్తించవని ముగ్గురు సిఐలూ రుజువు చేసినట్లుగా ఉన్న ఫొటోలు అంతర్జాలంలో చక్కర్లు కొట్టడంతో నెటిజన్లు ఖంగుతిన్నారు. కేబుల్ బ్రిడ్జ్‌పై పార్టీలు చేసుకుంటే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటూ సెక్షన్ 188 ప్రకారం కేసులు నమోదు చేస్తామని సదరు సిఐ గతంలో హెచ్చరించిన విషయం తెలిసిందే. కాగా వారే ఇలా నియమ నిబంధనలను మీరడమే కాకుండా ఫొటోలు తీసి సామాజిక మాధ్యమాలలో పెట్టడంతో, వారి చర్యలపై నెటిజన్లు మండిపడుతున్నారు. పోలీసు ఉన్నతాధికారులు ఆ ముగ్గురు సిఐలపై తగు చర్యలను తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ట్విట్టర్ వేదికగా తెలంగాణ డిజిపికు ఫిర్యాదు చేశారు.




లక్డీకాపూల్‌లో జరిగిన బీసీల రాజకీయ మేథోమథనం రాష్ట్ర సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

## సామ్యవాద సాహితీ రుషి శ్రీశ్రీ

చిక్కడపల్లి, మే 5 ప్రభాతవార్త: సామ్యవాద సాహితీ రుషి మహా శ్రీశ్రీ అని ప్రముఖ సాహితీ విమర్శకుడు ప్రొఫెసర్ పులికొండ సుబ్బాచారి అన్నారు. ఆదివారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని గుండవరపు హన్మంతరావు కళావేదికలో తెలుగు భాషా చైతన్యసమితి, కుసుమ ధర్మన్న కళాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో మహాకవి శ్రీశ్రీ జయంతి సభ ప్రముఖ కవులు రామకృష్ణ, చంద్రమౌళి అధ్యక్షతన జరిగిందది. ముఖ్యఅతిథిగా హాజరైన సుబ్బాచారి మాట్లాడుతూ శ్రీశ్రీ శ్రామిక జీవుల సౌభాగ్యానికి తన కవితాశక్తిని ధారపోశారన్నారు.

## ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి



1వ వార్డు బాపూజీ నగర్ ముత్యాలమ్మ ఆలయ అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్న జంపనప్రతాప్ తదితరులు

కంటోన్మెంట్, మే 5 ప్రభాతవార్త: కంటోన్మెంట్ బోయిన్‌పల్లి బాపూజీ నగర్‌లో ప్రసిద్ధిగాంచిన శ్రీ ముత్యాలమ్మ ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపనప్రతాప్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఆయన పర్యవేక్షించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు సూచించారు. ఆర్థికంగా నిలదొక్కుకున్న దాతలు ఆలయ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు దుర్గయ్య, లక్ష్మణ్, నాగేశ్, కొమురయ్య, మల్లేశ్, శ్రీకాంత్, రాజయ్య, పరశరామ్ పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నేతను కస్టడికి తీసుకున్న పోలీసులు




తార్నాక, మే 5 ప్రభాత వార్త : బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్‌ను ఒయూ పోలీసులు ఆదివారం కస్టడికి తీసుకున్నారు. క్రిశాంక్ ప్రస్తుతం చంచల్‌గూడా జైల్లో ఉన్నాడు. ఒయూ అధికారిక లెటర్‌ను మార్ఫింగ్ చేసిన కేసులో ఆయనను అరెస్టు చేసిన విశయం తెలిసిందే. అందులో భాగంగా ఒ.యూ పోలీస్ స్టేషన్‌లో ఆయనను విచారించారు. కోర్టు ఇచ్చిన 24 గంటల కస్టడిలో అతనిని పలు కోణాల్లో పోలీసులు విచారించారు. ఒయూ డాక్యుమెంట్ ఎలా ఎక్కడెక్కడికి సర్యులేట్ చేశారనే విషయాలతో పాటు పలు కోణాల్లో క్రిశాంక్‌ను విచారించారు. అతని వెంట అడ్వకేట్ లక్ష్మణ్ స్టేషన్‌కు వచ్చారు. విచారణ అనంతరం తిరిగి జైలుకు పంపించారు.

## ఉస్మానియా ఆసుపత్రిలో

# ఇక నుంచి స్కిప్ ది క్యూ ద్వారా స్కాన్

వైద్యం కోసం వచ్చే రోగులు ఆసుపత్రికి వచ్చి లైన్‌లో నిలబడాల్సిన పనిలేదు




అఫ్జల్‌గంజ్, మే 5 ప్రభాతవార్త: ఉస్మానియా జనరల్ ఆసుపత్రి దేశంలోనే పేరుగాంచిన ఆసుపత్రిగా రోగులకు సేవలు అందిస్తుంది. మారుతున్న కాలానికి అనుగుణంగా వైద్యం కోసం వచ్చే రోగులకు నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. నేషనల్ హెల్త్ ఎజెన్సీ, ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి స్కిప్ ది క్యూ ద్వారా స్కాన్ చేయాల్సి ఉంటుంది. వైద్యం కోసం వచ్చే రోగులు ఆసుపత్రికి వచ్చి లైన్‌లో నిల్చువల్సిన అవసరంలేదు. ఇంకా నుంచి దీనిని ముందుగా క్యూ ఆర్.కోడ్‌ను స్కాన్ చేసుకోవాల్సి ఉంటుంది. వేగంగా ఓపిడి నమోదు కోసం ముందుగా పై కోడ్ క్యూర్ స్కానర్ ఫోన్ కెమెరా ద్వారా దిగువ అభాయాప్‌లో ఏదైనా స్కాన్ చేసుకో వాల్సి ఉంటుందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్ తెలిపారు. (ఎబిడిఎం)ప్రారంభించిన యాప్‌ని ఇన్‌స్టాల్ చేసి రిజిస్ట్రేషన్ కోసం నమోదు చేసుకోవచ్చునన్నారు. ముందుగా మీ ప్రోఫైల్‌ని ఆసుపత్రి లో పంచుకోండి, తరువాత రిజిస్ట్రేషన్ టోకెన్ పొందవచ్చునన్నారు. మీ టోకెన్ ప్రకారం మీ ఓ.పి.స్లిప్‌ని రిజిస్ట్రేషన్ కౌంటర్ వద్దకు వచ్చి పొందవచ్చునన్నారు. ఉస్మానియా ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే రోగి ఎక్కడి అయినా (ఎబిడిఎం)ఆంగ్లబాషలో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని రోగి రిజిస్ట్రేషన్ నమోదు చేసుకుని ఆసుపత్రికి వస్తే కౌంటర్ వద్ద ఓపి స్లిప్‌ని అందచేస్తారు.ఆధార్‌కార్డు నెంబర్,సెల్‌ఫోన్ నెంబర్ నమోదు చేయాల్సి ఉంటుంది.

## కాంగ్రెస్ నేత దారుణ హత్య

అత్తాపూర్ మే 5,ప్రభాతవార్త : పార్లమెంట్ ఎన్నికల వేళ నిండు బహిరంగ సభలో కాంగ్రెస్ నేత దారుణ హత్యకు గురైన సంఘటన అత్తాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలో చేటుచేసుకుంది. పోలిసులు వివరాల ప్రకారం.. రాజేంద్ర నగర్ పరిధిలోని హసన్ నగర్‌లో శనివారం రాత్రి కాంగ్రెస్ సమావేశం నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి వెళ్లేందుకు ఇంద్రానగర్ పార్టీ కార్యాలయం వద్ద కాంగ్రెస్ నాయకులు చేరుకు న్నారు. ఈ క్రమంలోనే మజ్లిస్, కాంగ్రెస్ నేతల మధ్య వాగ్వాదం చేటుచేసుకుంది.కాంగ్రెస్ నేత మక్బూల్ అనే వ్యక్తిపై అంజాద్ అనే వ్యక్తి ఎంఐఎం నాయకులు వచ్చి కత్తితో దాడి చేశారు. భయం దోళనకు గురైన మిటింగ్ వచ్చిన ప్రజ లు పరుగురు తీశారు. ఈ దాడిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో స్థానికులంతా వెంటనే ఆసుపత్రికి తర లించారు. ఆసప్రతిలో చికిత్స పొందుతూ కాంగ్రెస్ నేత మక్బుల్ మృతి చెందారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి



జగద్గిరిగుట్ట, మే 5, ప్రభాతవార్త : జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌కు చెందిన ఇ.రవీందర్ హెచ్‌సి 3136 ఈ నెల 3వ తేదీన 6గంటల ప్రాంతంలో జగద్గిరిగుట్ట సరిహద్దుల్లో పెట్రోలింగ్ చేస్తుండగా, గాజులరామారం చిత్తారమ్మ దేవాలయం సమీపంలో ఓగుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడిపోయాడని చుట్టు ప్రక్కలవారు తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా, తెల్ల టీషర్టు నలుపు రంగు ఫార్మల్ ఫ్యాంటుతో అపస్మారక స్థితిలో ఉన్న సుమారు (30-35) సంవత్సరాల వ్యక్తిని గమనించి, అంబులెన్స్‌కు సమాచారం అందించగా వారు వచ్చి గుర్తు తెలియని వ్యక్తిని పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు వెల్లడించారు.

## విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటలతో రాణించాలి : డాక్టర్ రిషికాంత్

చిక్కడపల్లి, మే 5 ప్రభాతవార్త: విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటలతో రాణించి దేశానికి, స్వరాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలను తీసుకురావాలని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రిషికాంత్ అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కళాశాలలో 'గలా ఫెస్ట్-2024' ఉత్సవం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు ఆటపాటలతో ప్రాంగణంలో సందడి చేయడంతో హోరెత్తింది. ముఖ్యఅతిథిగా హాజరై రిషికాంత్ మాట్లాడుతూ సృజనాత్మకతను ప్రదర్శించి తమకు తాము నిరూపించుకోవాలన్నారు. విద్యార్థి జీవితంలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



నృత్యాలు నిర్వహిస్తున్న విద్యార్థినీ విద్యార్థులు

# వీళ్లే కీలకం!

గ్రేటర్‌లో స్థిరపడిన ఇతర రాష్ట్రాల ఓటర్లే ప్రధానం




నగరంలో స్థిరపడిన వారిలో అత్యధికులు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారే కావడం. తెలంగాణలో 13వ తేదీనే లోక్‌సభ ఎన్నికలు జరుగుతుండడం, ఆదే రోజూ ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు జరుగుతుండడంతో ఇక్కడ స్థిరపడినవారు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఏపీకి వెళ్లేందుకే పలువురు మొగ్గుచూపుతున్నారు. ఈ నేపథ్యంలో నగరంలో పోలింగ్ శాతంపై ప్రభావం చూపి అభ్యర్థుల భవితవ్యం తమ ప్రయాణ ఏర్పాట్లు చేసుకుంటుండడం గమనార్హం.

- వేర్వేరు ప్రాంతాల్లో లక్షల సంఖ్యలో నివాసం
- శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, జూబ్లీహిల్స్, ఎల్బీనగర్‌లో ఏపీ వాసులు
- వీరి ఓట్లపై కాంగ్రెస్,బీఆర్ఎస్ ఆశలు
- ఉత్తరాది ఓటర్లపై బీజేపీ కన్ను
- అదే రోజు ఏపీలో ఎన్నికలు
- సొంతూళ్లకు వెళ్లితే పోలింగ్‌శాతం పడిపోయే అవకాశాలు లేకపోలేదు

హైదరాబాద్, మే 5, ప్రభాతవార్త : ఉద్యోగం, ఉపాధి, విద్య కారణాలేమైనా దేశంలోని వివిధ రాష్ట్రాలు, తెలంగాణాలోని ఇతర జిల్లాల నుంచి గ్రేటర్ హైదరాబాద్‌కు వచ్చి స్థిరపడుతుంటారు. దీంతో వివిధ మతాలు, సంస్కృతీ సప్రదాయాలు, ఆహారపు అలవాట్లతో హైదరాబాద్ కాస్మోపాలిటన్ సిటీగా పేరుగాం చింది. ఈ నెల 13న జరగనున్న పార్లమెంటు ఎన్నికలలో గ్రేటర్‌లో వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చి స్థిరపడిన ఓటర్లు కిలకంగా మారనున్నారు. రాజధాని పరిధిలోని 29 నియోజకవర్గాల్లో మెజార్టీ స్థానాలలో అభ్యర్థుల భవితను వీరు నిర్ణయించనున్నారు.

**వారి మద్దతు కోసం..** గ్రేటర్‌లో స్థిర నివాసం ఏర్పర్చుకున్నవారి మద్దతు కూడగట్టేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు తీవ్రంగా శ్రమిస్తు న్నాయి. వీరిని ప్రసన్నం చేసుకోవడానికి సికింద్రా బాద్, మల్కాజ్‌గిరి, చేవెళ్ల లోక్‌సభ స్థానాల నుంచి పోటీచేస్తున్న వివిధ పార్టీల అభ్యర్థులు ఆయా ప్రాంతాల నుంచి నేతలను రప్పించి ఆ ఓటర్లతో మాట్లాడిస్తు న్నారు. నాలుగైదు రోజుల్లో వివిధ రాష్ట్రాల నుంచి పలు పార్టీల నేతలు ప్రత్యేకంగా హైదరాబాద్‌కు వస్తుండటం విశేషం. శేరిలింగంపల్లి, కూకట్‌పల్లిలో ఏపీ నుంచి వచ్చిన వారే అధికంగా ఉన్నారు. ప్రస్తుతం ఈ లోక్‌సభ నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులు ఓ వర్గం ఓటర్లను ఆకర్షించేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు.

**ఉత్తరాది ఓటర్లపై ఆశలు..** ఎల్బీ నగర్ పరిధిలో తెలంగాణ లోని వివిధ జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాల వారు వేల సంఖ్యలో ఉన్నారు. ఇక్కడి కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ అభ్యర్థులు ఆయా ఓటర్ల మీదే దృష్టి పెట్టారు. మహే శ్వరంలో దాదాపు 70వేల నుంచి లక్ష మంది వరకు బిహార్, రాజస్థాన్, యూపీ ఇతర ప్రాంతాల ఓటర్లు ఉన్నారు. వీరిని తమ వైపు తిప్పుకునేందుకు బీజేపీ విశ్వప్రయత్నాలు చేస్తోంది. సాధారణంగానే ఉత్తరాది రాష్ట్రాల వారు బీజేపీకి మద్దతుగానే ఉంటారు. వీరు ఎటువైపు మొగ్గు చూపితే వారికే విజయం లభించే అవకాశం ఉంది. గ్రేటర్ బీజేపీ ప్రధానంగా కొన్ని వర్గాల ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు ఆపార్టీ ఎన్‌డిఎ భాగస్వామి జనసేన పార్టీ సహకారం లేకపోలేదు.

**గ్రేటర్‌లో స్థిపడినవారు 42లక్షల మంది..** ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, బిహార్, ఉత్తర ప్రదేశ్, ఝార్ఖండ్, పంజాబ్, తమిళనాడు, కేరళ, ఒడిషా తదితర రాష్ట్రాలతో పాటు తెలంగాణలోని వివిధ జిల్లాలకు సంబంధించి గ్రేటర్‌లో స్థిరపడినవారు సుమారు 42లక్షల మంది ఉంటారని అంచనా. ఏపీ నుంచి వచ్చిన వారిలో అత్యధికంగా శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, మల్కాజ్‌గిరి, ఎల్బీనగర్, సనత్‌నగర్ వంటి నియోజకవర్గాలలో, మహేశ్వరం, గోషామహల్, జూబ్లీహిల్స్, సికింద్రాబాద్, కంటోన్మెంట్ వంటి సెగ్మెంట్లలో ఇతర రాష్ట్రాల వారు స్థిరపడ్డారు. ఆయా నియోజకవర్గాల్లోని అభ్యర్థుల గెలుపోటములు నిర్ణయించేది వీరే అనడంలో సందేహంలేదు.

## దేవాలయాల పవిత్రతను కాపాడాలి



హైమావతినగర్ శ్రీప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో ధ్వజస్థంభ ఏర్పాటు సందర్భంగా హోమంలో పాల్గొన్న ఆలయ అధ్యక్షులు డాక్టర్ గూడురు చెన్నారెడ్డి

యూసుఫ్‌గూడ, మే 5, ప్రభాతవార్త : దేవాలయాలను పవిత్రంగా ఉంచుకోవడంతో పాటు వాటిని పరిరక్షించుకో వాల్సిన భాద్యత మనందరిపై ఉందని హైమావతినగర్ శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవాలయం కమిటి అధ్యక్షులు డాక్టర్ గూడురు చెన్నారెడ్డి అన్నారు.ఆదివారం ఆలయంలో ధ్వజస్థంభ ఏర్పాటుకు దాతలు డాక్టర్ చింతపల్లి వంశీ మోహన్‌రెడ్డి. డిఎస్‌పి, శోభారెడ్డి, ఆధ్వర్యంలో వేద పండితు లచే వేదమంత్రాలతో మేల తాళాలతో ఘనంగా పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కృష్ణ, జి.నరేందర్‌రెడ్డి, జి.మంజుల రెడ్డి, కళ్యాణిరెడ్డి, శివరా మకృష్ణ, కెహెచ్‌ఎస్ శర్మ, డి.రాములు, దూడల రవిగౌడ్, పామిరెడ్డిప్రవీణ్‌రెడ్డి, ఇందిరా, డి.సందీప్, డాక్టర్ రామారావు, డాక్టర్ పద్మ, గిరిజ, రాధాకృష్ణ, పోతిరాజు నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలను రద్దు చేస్తే ఉద్యమం తప్పదు

సైఫాబాద్, మే 5 ప్రభాతవార్త: పరిపాలన సౌలభ్యం కోసం కెసిఆర్ తెలంగాణ రాష్ట్రంలో 33 జిల్లాలను ఏర్పాటు చేస్తే సిఎం రేవంత్‌రెడ్డి రద్దు చేసి 19 జిల్లాలు చేస్తామని ప్రకటించడం ప్రజలను ఇబ్బందులకు గురిచేయడమేనని లోక్‌దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకటరాజేశ్వర్ రావు చెప్పారు. జిల్లాల జోలికి వస్తే సహించేది లేదని ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ప్రజలు కిలోమీటర్ల దూరం పోకుండా సత్వరమే న్యాయం జరగాలని కెసిఆర్ 33 జిల్లాలు చేశారని, దీంతో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని, రోజుల తరబడి కార్యాలయాల చుట్టు తిరగకుండా ఎప్పటి కప్పుడు సమస్యలను పరిష్కారించుకుంటున్నారని చెప్పారు. రేవంత్‌రెడ్డి జిల్లాలను రద్దు చేస్తామనే ఆలోచనను విరమించుకోవాలన్నారు.

## బిఆర్ఎస్‌లో చేరిన 2వ వార్డు కాంగ్రెస్ నేతలు

కంటోన్మెంట్, మే 5 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గం 2వ వార్డుకు చెందిన కొందరు కాంగ్రెస్ నాయకులు, యువకులు బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ ఎన్నికల ఇన్‌ఛార్జి రావుల శ్రీధర్ రెడ్డి, అభ్యర్థి నివేదితల సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి కండువకప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



శ్రీవారి సన్నిధిలో కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

## రిజర్వేషన్లు పరిక్షించాలంటే బిజెపిని గద్దె దించాలి

మాల ప్రజా సంఘాల జెఎసి ఛైర్మన్ జి.చెన్నయ్య పిలుపు



సదస్సులో ప్రసంగిస్తున్న జి.చెన్నయ్య

సైఫాబాద్, మే 5 ప్రభాతవార్త: భారత రాజ్యాంగాన్ని, ఎస్సీ, ఎస్టీ, బిసి రిజర్వేషన్‌లను కాపాడుకోవాలంటే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించాలని మాల ప్రజా సంఘాల జెఎసి ఛైర్మన్, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య పిలుపునిచ్చారు. బిజెపి తిరిగి కేంద్రంలో అధికారం చేపడితే రాజ్యాంగాన్ని మార్చివేసి, రిజర్వేషన్‌లను తొలగించే అవకాశం ఉందని ఆరోపించారు. 'రాజ్యాంగాన్ని, రిజర్వేషన్‌లను పరిరక్షిద్దాం' అనే అంశంపై ఆదివారం స్ఫూర్తి భవన్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాజ్యాంగాన్ని, రిజర్వేషన్‌లను కాపాడుకోవాలంటే బిజెపిని ఓడించి కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాలని ఆయన సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం అంకితాభావంతో పనిచేసి బిజెపిని ఓడిస్తేనే దళిత బహుజనులతోపాటు మైనార్టిలకు రక్షణ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాల మహానాడు నాయకులు రాజేష్, రాకేష్, కృష్ణమూర్తి, రమేష్, శ్రీకాంత్, ఎల్లస్వామి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు టీ ఎమ్మార్పీఎస్ మద్దతు



విలేకర్ల సమావేశంలో టీ ఎమ్మార్పీఎస్ నేతలు ఇటుక రాజు మాదిగ, కనకరాజు మాదిగ, సంకి రవిందర్ తదితరులు

**ఇటుక రాజు మాదిగ**

కంటోన్మెంట్, మే 5 ప్రభాతవార్త: లోక్ సభ, కంటోన్మెంట్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి టీ ఎమ్మార్పీఎస్ సంపూర్ణ మద్ధతు తెలుపుతున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షులు ఇటుక రాజు మాదిగ, టీ.ఎం.హెచ్.డి.అధ్యక్షులు జన్ను కనకరాజు మాదిగ, 57 ఉప కులాల అధ్యక్షులు చింతల రాజలింగంలు తెలిపారు. ఆదివారం కంటోన్మెంట్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నో త్యాగాలతో కూడిన కాంగ్రెస్ పార్టీ దేశ శ్రేయస్సుకోసం పాటుపడుతుందన్నారు. కంటోన్మెంట్ కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేష్ పార్టీలకు అతీతంగా గత 15 సంవత్సరాల నుంచి కంటోన్మెంట్‌లో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ఆయన సేవలను గుర్తించి గతంలో రెండు సార్లు శ్రీగణేష్‌కు బిజెపి టికెట్ ఇచ్చిందన్నారు. కంటోన్మెంట్ వికాస్ మంచ్ సంస్థ ప్రధాన కార్యదర్శి సంకి రవిందర్, టీ ఎమ్మార్పీఎస్ నేత ఇటుక గోపీ మాదిగ, మహిళా నాయకురాళ్లు రేణుక, సబితా, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధుడు అదృశ్యం



పేట్ బషీరాబాద్, మే 5, ప్రభాతవార్త : పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక వృద్ధుడు అదృశ్యమైన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుండ్లపోచంపల్లి గ్రామంలో నివాసం ఉంటున్న కొమ్ము గోపాల్ (60) ఇంటి వద్దనే ఉండేవాడు. ప్రతి రోజు ఉదయం 7గంటలకు ఇంట్లో నుండి బయటకు వెళ్లి చాయ్ షాపు వద్దకు వెళ్లి, అక్కడ చాయ్ త్రాగి తిరిగి 10గంటలకు ఇంటికి వచ్చేవాడు. అయితే ఏప్రిల్ నెల 30వ తేదీన రోజులాగే ఉదయం 7గంటలకు ఇంట్లో నుండి బయటకు వెళ్లి మధ్యాహ్నం 1గంటలకు వరకు ఇంటికి తిరిగిరాలేదు. ఇన్ని రోజులు చుట్టు ప్రక్కలవారిని, బంధువుల వద్ద, తెలిసినవారిని విచారించిన ఎలాంటి ఆచూకి తెలియపోవటంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఒబీసీ సెంట్రల్ కమిటీ సమావేశంలో పాల్గొన్న చిన్నయ్య ముదిరాజ్, భాగ్యలక్ష్మీ తదితరులు



భాగ్యనగర భరతోత్సవంలో పాల్గొన్న చిన్నారులు

## జాతీయస్థాయి నృత్య ప్రదర్శనలో అలరించిన చిన్నారులు

హైదరాబాద్, మే 5, ప్రభాతవార్త: జాతీయస్థాయి సంగీత నృత్య ప్రదర్శనలో బాచుపల్లి శ్రీశర్వాణి నాట్య కళాశాలకు చెందిన హరిప్రియ తుమ్మలపల్లి శిష్యులు సమర్పించిన భరతనాట్య ప్రదర్శన ఆహుతులను విశేషంగా అలరించింది. ఆదివారం రవీంద్ర భారతిలో జరిగిన భాగ్యనగర భరతోత్సవం కార్యక్రమంలో చిన్నారులు నేహిత, శ్రీహిత, విరాజిత, లహరి, షష్మితలు వారి వయసుకు తగిన హావ భావాలతో అందరినీ అబ్బురపరిచారు. శ్యామలే మీనాక్షి, అచ్యుతం కేశవం వంటి పాటలతో వారు ప్రదర్శించిన భరతనాట్య ప్రదర్శన కన్నుల విందు చేసిందని పలువురు కొనియాడారు. నిర్వాహకులు చిన్నారులకు జ్ఞాపికలు అందించి, ఆశీర్వదించారు.

## కేంద్ర మంత్రిగా కిషన్‌రెడ్డి అద్భుత విజయాలు సాధించారు

హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బిజెపి ఉపాధ్యక్షురాలు జూటురి కీర్తిరెడ్డి

యూసుఫ్‌గూడ, మే 5, ప్రభాతవార్త : ఎంపీగా సికింద్రాబాద్ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూనే కేంద్ర మంత్రిగా కిషన్‌రెడ్డి అద్భుత విజయాలు సాధించారని హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బిజేపి ఉపాధ్యక్షురాలు జూటురి కీర్తిరెడ్డి అన్నారు. బీజేపి పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ భారతదేశంలో టూరిజంను ప్రపంచంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దారన్నారు. నేటి రాజకీయాల్లో చిన్న పదవులు వరించగానే ఆడంబారలకు పోయే నాయకులు ఎక్కవగా ఉన్నారని అయితే అత్యున్నత పదవిలో కొనసాగుతున్నప్పటికి ఎటువంటి ఆడంబరాలకు పోకుండా ప్రజలకు ఏమి కావాలి దేశానికి ఎటువంటి సేవలు అందించాలని అనే ఆలోచనతో పని చేస్తున్న ఏకైక నాయకుడు కిషన్‌రెడ్డి అన్నారు. పార్టీ ఎలా ఆదేశించిన ఆభాద్యత నూటికి నూరు పాల్లు పారదర్శకంగా పూర్తి చేస్తా న్నారు. అందుకు ఉదాహరణగా కోవిడ్ సమయంలో సమర్థవంతంగా కేంద్రం అప్పజెప్పిన బాధ్యతను పూర్తిచేశారని గుర్తుచేశారు. అయితే తెలంగాణలో వెయ్యిస్థంభాల గుడి, జోగులాంభ ఆలయం, బల్కంపేట ఆలయం ఇలా అనేక ఆలయాలకు పూర్వ వైభవం తేవడంతో పాటు మౌలిక వసతులు కల్పించారన్నారు.

## పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులు ఓటు హక్కును ఉపయోగించుకోవాలి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**
పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులు తమ ఓటు హక్కును ఉపయోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి కోరారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు దరఖాస్తు ఉద్యోగులకు ఇప్పటికీ పోలింగ్ కేంద్రాల వివరాలను అందించడం జరిగిందన్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు సిద్దిపేట, దుబ్బాక,గజ్వేల్, హుస్నాబాద్‌లలో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాలలో ఈనెల 8 వరకు ఓటు వేయవచ్చు తెలిపారు. సిద్దిపేట ఆర్డీవో కార్యాలయంలో, దుబ్బాకలో ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్‌లో గజ్వేల్ ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్, హుస్నాబాద్ ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాలలో ఉదయం 10.30 గంటల నుంచి తమ ఓటు హక్కును తప్పనిసరిగా ఉపయోగించుకోవాలన్నారు.

## పద్మశాలీలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం: నగేష్‌శెట్కార్

**నారాయణఖేడ్, మే 5 ప్రభాతవార్త:**
పద్మశాలీలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ ప్రణాళిక సంఘం సభ్యులు నగేష్‌శెట్కార్ అన్నారు. ఆదివారం నారాయణఖేడ్ పట్టణం లో శ్రీభక్త మార్కండేయ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో పద్మశాలీల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి నగేష్ శెట్కార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లడుతూ పద్మశాలీలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ల ప్పుడు అండగా ఉంటుందన్నారు. పద్మశాలీలు సమాజం పట్ల వృత్తిపరంగా బట్టలునేస్తూ జీవనం కొనసాగిస్తారని చెప్పారు.

పద్మశాలీల కుల వృత్తులను కాపాడేలా వారి జీవితాల్లో పూర్వవైభవం తెచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గున్నాల నర్సింలు, గుజ్జేటీ సంగయ్య, నక్క నర్సింలు, లక్ష్మీనారాయణ, మల్లన్న, కూచిన ప్రకాష్, యువ నాయకులు గున్నాల శ్రీనివాస్, సోమ సిద్దు, గోస్కే శ్రీనివాస్, గుండు శివకుమార్, బోగ పండరి, ఎనుగంటి శంకర్, దుర్గం సతీష్, అనిల్, మార్గం విఠల్, దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ సిబ్బందికి మెరుగైన వసతులు కల్పించాలి

**-పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మల్లారెడ్డి**

మెదక్ మున్సిపాలిటీ, మే5 ప్రభాతవార్త: వేసవి కాలం దృష్ట్యా ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలింగ్ సిబ్బందికి మెరుగైన వసతులు కల్పించాలని పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎల్. మల్లారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎండలు, వడదెబ్బలతో ఉపాధ్యాయులు ఆందోళనలో ఉన్నారని, డూటీలు చేయడానికి జంకుతున్నారని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పాల్గొనే ఉపాధ్యాయులకు, ఇతర పోలింగ్ సిబ్బందికి ఎండలు మండిపోతున్న దృష్ట్యా మెరుగైన సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్, ఇతర ఎన్నికల నిర్వహణ అధికారులకు విజ్ఞప్తి చేశారు. శనివారం ఎన్నికల నిర్వహణలో సిద్ధిపేట జిల్లాకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు లుకావత్ రామన్న వడదెబ్బకు గురై మరణించడం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు దృష్టిలో ఉంచుకొని అన్ని పోలింగ్ కేంద్రాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, కూలర్స్, చల్లటి త్రాగునీరు, ఎండ తగలకుండా తగు ఏర్పాట్లు చేయాలని, వైద్య సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచాలని కోరారు.



5కే రన్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనుచౌదరి

## ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనుచౌదరి**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా జిల్లాలో ఓటరు శాతం పెంచేందుకు సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్(ఎస్‌విఈఈపి) ప్రోగ్రామ్ కార్యకలాపాల్లో ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో 5కే రన్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మిక్కిలినేని మనుచౌదరి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్, సైక్లింగ్ క్రీడాకారులు, విద్యార్థులు,యువకులు, ఉద్యోగులు పెద్దఎత్తున్న పాల్గొన్నారు. ఎస్‌విఈఈపీ కార్యకలాపాలలో 5కేరన్ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లాలోని సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాలు మెదక్ పార్లమెంటు పరిధిలోకి వస్తాయని హుస్నాబాద్ కరీంనగర్ పార్లమెంటు పరిధిలోకి వస్తుందన్నారు. మే 13న జరిగే పోలింగ్ లో ఓటుహక్కు ఉన్న ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ఎవరూ ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌విఈఈపీ నోడల్ అధికారి జయదేవ్ ఆర్యా, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషన్, డిగ్రీ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

### పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్న ఉద్యోగులు

**జహీరాబాద్, మే 5, ప్రభాతవార్త:** పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని ఆదివారం ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. శని, ఆదివారాల్లో వినోద్‌కుమార్, ఆదివారం 253 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారని ఆర్‌డిఓ ఎస్ రవి తెలిపారు. ఆదివారం వరకు 460మంది ఉద్యోగులు తమ పోస్టల్ బ్యాలెట్ ద్వార ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు.

### భక్తులతో పోటెత్తిన తునికి శ్రీనల్ల పోచమ్మ ఆలయం

**కౌడిపల్లి, మే 5, ప్రభాతవార్త:** తునికి శ్రీనల్ల పోచమ్మ ఆలయం అదివారం భక్తులతో పొటెత్తింది. ఆదివారం సెలవు దినం కావడంతో ఉదయం నుండి భక్తులు, పలువురు ప్రభుత్వ ఉద్యోగస్థులు కుటుంబ సమేతంగా తునికి శ్రీనల్లపోచమ్మ ఆలయానికి పెద్దఎత్తున తరలివస్తున్నారు. ఈఓ మోహన్‌రెడ్డి, చైర్మన్ తాళ్ల శ్రీనివాస్‌రెడ్డి, అర్చకులు శివప్పలు శ్రీనల్లపోచమ్మ అమ్మవారికి పంచామృతాభిషేకం చేసి కుంకుమార్చన చేసిన తర్వాత భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు శివసత్తుల విన్యాసాలు, డప్పుచప్పుళ్ల మధ్య బోనాలతో ఆలయం చుట్టూ తిరిగి అమ్మవారికి సమర్పించారు. అలాగే జంతు బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈఓ మోహన్ రెడ్డి సిబ్బంది సహకారంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు.

### పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

**-డిసిసి అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి**

**ములుగు, మే 5 (ప్రభాతవార్త):** పేద ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ములుగు మండలం జప్తిసింగాయిపల్లి గ్రామానికి చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు నీలం ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి తూంకుంట నర్సారెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్, బిజెపి పార్టీల నాయకులను నమ్మి మోసపోవద్దని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది కాబట్టి పేదల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపి అభ్యర్థి నీలం మధును గెలిపించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### చిల్వర్‌లో బీరప్పస్వామికి బోనాలు


చిల్వర్ గ్రామంలో బీరప్ప స్వామికి బోనాలను ఊరేగిస్తున్న భక్తులు

**అల్లాదుర్గం, మే 5, ప్రభాతవార్త:** మండలంలోని చిల్వర్ గ్రామ శివారులోని శ్రీబీరప్ప స్వామికి ఆదివారం బోనాలను ఊరేగించారు. బీరప్ప జాతర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గ్రామస్థులు తలపై బోనాలు ఎత్తుకుని సామూహికంగా భజనలు చేస్తూ, యువకుల నృత్యాలు, డోలు వాయిద్యాలు, శివసత్తుల నృత్యాలు, పోతరాజుల విన్యాసాల మధ్యా భక్తి శ్రద్దలతో బోనాలను ఊరేగించారు. గోవింద నామస్మరణతో గ్రామం మారుమ్రోగింది. సామూహికంగా బోనాలతో ఆలయానికి చేరుకున్న భక్తులు స్వామి వారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాలను తిలకించేందుకు గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని బోనాలను తిలకించి స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

### రమేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో బిజెపిలో చేరికలు

**నర్సాపూర్ మే, 5. ప్రభాతవార్త :** మండల పరిధిలోని నత్నాయపల్లి గ్రామస్తులు పలువురు బిజెపిలో చేరారు. ఆదివారం బిజెపి ఓబిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి రమేశ్‌గౌడ్, బిజెపి మండల అధ్యక్షుడు నీలి నాగేశ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నుండి నత్నాయపల్లి గ్రామానికి చెందిన భూత్ అధ్యక్షుడు సాయినాథ్, బిఆర్ఎస్ పార్టీ నుండి గణేశ్, యాదగిరిలతోపాటు 30 మంది యువ నాయకులు ఆ పార్టీలకు రాజీనామ చేసి బిజెపి తీర్థం పుచ్చుకున్నారు. పాపగారి రమేశ్‌గౌడ్, నీలి నాగేశ్‌ల సమక్షంలో బిజెపిలో చేరారు.బిజెపిలో చేరినవారికి బిజెపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఓబిసి రాష్ట్ర ఉపా ధ్యక్షులు పాపగారి రమేశ్‌గౌడ, బిజెపి మండల అద్యక్షులు నీలి నాగేశ్‌లతో పాటు పట్టణ అద్యక్షులు ఆంజనేయులుగౌడ్, మండల బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# ఆరు గ్యారెంటీల అమలుపై శ్వేతపత్రం విడుదల చేయాలి

◆ **ప్రజలను బురిడికొట్టిసున్న సిఎం రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీ : మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుపై శ్వేతపత్రం విడుదల చేయాలని రాహుల్‌గాంధీ, సిఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు మండిపడ్డారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో అదివారం తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నామని నిర్మల్ బహిరంగ సభలో రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. రాహుల్‌గాంధీ కాదు అయన రాంగ్ గాంధీ అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి 5 గ్యారెంటీలను అమలు చేస్తున్నామని చెబుతుంటే రాహుల్‌గాంధీ అన్ని హామీలను అమలు చేస్తున్నట్లు చెప్పడంతో ప్రజలు నవ్వుకుంటున్నారని తెలిపారు. అబద్దాలు చెప్పడంలో సిఎం రేవంత్‌రెడ్డి బ్రాండ్ అంబాసిడర్ కాగా నేనేమి తక్కువ కాదన్నట్లుగా రాహుల్‌గాంధీ మాట్లాడుతున్నారని తెలిపారు. హామీల అమలుపై రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు అబద్దాలు చెప్పడంతోపాటు రాహుల్‌గాంధీతో సైతం అబద్దాలు చెప్పించడం సిగ్గుచేటన్నారు. అరు గ్యారెంటీలలో భాగంగా మహిళలకు ప్రతి నెల ఇచ్చే రూ. 2500 అమలు చేస్తున్నామని రాహుల్‌గాంధీ నిర్మల సభలో చెప్పడం తెలంగాణ మహిళలను అవమాన


మాట్లాడుతున్న హరీష్‌రావు

పర్చడమేనని అన్నారు. మహిళలకు ప్రతి నెల రూ. 2500 ఎక్కడ ఇచ్చారో తెలపాలని డిమాండ్‌చేశారు. ఆరు గ్యారెంటీల అమలుపై రాహుల్‌గాంధీ, సిఎం రేవంత్‌రెడ్డి ఇద్దరు తోడు దొంగల్లా రాష్ట్ర ప్రజలను తప్పుదుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. నిర్మల సభలో ఆరు గ్యారెంటీలు అమలవుతున్నాయని రాహుల్ గాంధీ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చేయకపోవడంతో రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. రాష్ట్రంలో ఏ పథకాలు అమలవుతున్నాయో తెలుసుకోకుండా రాహుల్‌గాంధీ మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ఆరు గ్యారెంటీల అమలుపై మంత్రులను, కాంగ్రెస్ పార్టీ ఎంపి అభ్యర్థులను నిలదీయాలన్నారు. అరు గ్యారెంటీలలో రాహుల్ గాంధీ అన్ని అములయ్యాయని సిఎం రేవంత్‌రెడ్డి 5 గ్యారెంటీలు అమలు చేశామని చెబుతున్నారని నేను మాత్రం ఒక్కటే గ్యారెంటీ అములైందని అంటున్నానని బహిరంగ చర్చకు సిద్దామ అని సవాల్ విసిరారు. దేశంలో పేదరికం, నిరుద్యోగం, అకలి పెరగడానికి కాంగ్రెస్, బిజెపి పార్టీలే కారణమన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు గుండు భూపేష్, సంపత్‌రెడ్డి,రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.

# వనదుర్గమ్మ సన్నిధిలో భక్తుల సందడి


పూజలందుకుంటున్న ఏడుపాయల వనదుర్గా భవానిమాత, అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

**పాపన్నపేట, మే 5, ప్రభాతవార్త:**
పవిత్ర పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గా భవాని మాత ఆలయం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. ఆయా ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకోవడంతో ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి.

ఆలయానికి చేరుకున్న భక్తులు మొక్కుబడిలో భాగంగా అమ్మవారికి తలనీలాలు సమర్పించి మంజీరా పాయల్లో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారికి బోనాలు సమర్పించి, ఒడి బియ్యం నింపి కుంకుమార్చన పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఆలయానికి చేరుకున్న భక్తులు అమ్మవారి దర్శనానికి ఎలాంటి ఇబ్బంది కల్లకుండా ఆలయ కమిటి చైర్మన్ సాతెల్లి బాలగౌడ్, ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి, ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, రవి వీర్‌కుమార్, ప్రతాప్‌రెడ్డి, తోట నరసింహులు, వరుణాచారి, రాజు, శ్రీకాంత్ తదితరులు తగు సహకారం అందించారు.

ఆలయానికి చేరుకున్న భక్తులు ఆలయ అర్చకులు శంకరశర్మ, పార్థివ శర్మ, మురళీధర్‌లు వేద మంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పరిసరాల్లో ఎస్ఐ నరేష్ తన సిబ్బందితో నిఘా నిర్వహించారు.

## సనాతన ధర్మం జీవితంలో భాగమవ్వాలి

**జహీరాబాద్, మే 5, ప్రభాతవార్త:** సనాతన ధర్మ ప్రతి వ్యక్తి జీవితంలో భాగస్వామ్యం కావాల్సి అవసరం ఉందని జన జాగరణ మంచ్ తెలంగాణ ప్రాంత బాధ్యులు నల్లా చక్రవర్తుల రామకృష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని రాం మందిరంలో సనాతన ధర్మ-మన కర్తవ్యం అంశంపై బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సుకు నల్లా చక్రవర్తుల రామకృష్ణ ప్రధాన వక్తగా హాజరై ప్రసంగించారు. సనాతన ధర్మం విషయంలో అపోహాలు ఏర్పడేలా రాజకీయ వివాదాలు సృష్టిస్తున్నారని, హిందూమతంలో చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక సమరసత, ప్రకృతి పరిరక్షణ, ప్లాస్టిక్ నిషేదం లాంటివి ఉన్నాయని, ఈ దిశగా ప్రజలు చైతన్యవంతులు కావాల్సిన అవసరం ఉందన్నారు. భారతీయత, హిందూ ధర్మం వేరు వేరని గుర్తు చేశారు. క్రమశిక్షణతో ఎదైనా సాధించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం, బ్రాహ్మణ సేవా సమాజ్ అధ్యక్షులు శంకర్‌రావు కులకర్ణి, రాజ్‌కుమార్ దేశ్‌పాండే, వైద్యులు సురేస్ కులకర్ణి, బావురావు జ్యోషి, పునీత్ దీక్షితులు, సురేష్ జోషి, మహిళా నాయకులు ప్రభావతి, రత్నమాల పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నల్లా చక్రవర్తుల రామకృష్ణ

# ఈవీఎంల ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి

**మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్**

**నర్సాపూర్ మే, 5, ప్రభాతవార్త :**
ఈ నెల 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల కోసం ఈవిఎంల కమిషనింగ్ ప్రక్రియను చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం నర్సాపూర్ పట్టణ సమీపంలోని బివిఆర్ఐటి కళాశాలలో ఈవిఎంల కమీషనింగ్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు కమీషనింగ్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. ఈవిఎంల సీరియల్ నెంబర్‌లు, అభ్యర్థుల పేర్లు, వారికి కేటాయించిన గుర్తుల ఏర్పాటు పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. కమీషనింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించి ఈవిఎంల పనితీరును పరిశీలించాలన్నారు. అలాగే స్ట్రాంగ్ రూమ్ నిర్వహణ వివరాలను ఏఆర్ఓలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నర్సాపూర్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో పోస్టల్


పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్

బ్యాలెట్ ఓటింగ్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ పరిశీలించారు. నర్సాపూర్ ఆర్డీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సరళిని పరిశీలించారు. ఆర్డీవో కార్యాలయానికి ఓటు వేయడానికి వచ్చే ప్రతి పౌరునికి అధికారులు, సహాయ సహకారాలు అందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ వెంట ఎన్నికల అధికారి ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, తహాసీల్దార్‌లు కమలాద్రి, శ్రీనివాస్‌చారి, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


బీరప్ప జాతర ఉత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

### వైభవంగా శ్రీబీరప్ప కామరతి కళ్యాణ మహోత్సవం

**మనూర్, మే 5, ప్రభాతవార్త:** మండలంలోన తుమ్నూర్ గ్రామంలో శ్రీ బీరప్పస్వామి జాతర మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి పాల్గొన్నారు. జాతర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీ బీరప్ప కామరతి కళ్యాణ మహోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిని ఆలయ కమిటి ఘనంగా సన్మానించారు. ఆలయంలో మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యేతో పాటు బిఆర్ఎస్ మండల అధ్యక్షులు విఠల్‌రావ పాటిల్, నాయకులు అశోక్‌రెడ్డి, గుండన్న, కురుమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

### మైకోడ్‌లో సామూహిక యజ్ఞం


మైకోడ్‌లో సామూహిక యజ్ఞం నిర్వహిస్తున్న భక్తులు

**మనూర్, మే 5, ప్రభాతవార్త:** మండలంలోని మైకోడ్ గ్రామంలో ఆదివారం వివేకానంద సేవ సమితి ఆధ్వర్యంలో సామూహిక జ్ఞ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 5 సంవత్సరాలుగా గ్రామం సుభిక్షంగా ఉండేందుకు ప్రతి మాసంలో వచ్చే మొదటి ఆదివారం రోజున గ్రామంలో సామూహికంగా యజ్ఞ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగా మే నెల మొదటి ఆదివారం ఆలయంలో 12 మంది పుణ్యదంపతులచే పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంఘం మహారాజ్, విశ్వహిందూ పరిషత్ తెలంగాణ సత్సంగ్ కమిటి అధ్యక్షులు మరిపల్లి రాంరెడ్డి, వివేకానంద సేవ సమితి బాధ్యులు, గ్రామ భక్తులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు.

### బిజెపిలో చేరిన బిఆర్ఎస్ నేతలు

**సిర్గాపూర్, మే 5, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ జడ్పీటిసి సభ్యులు రాఘవ్ రెడ్డి, రాష్ట్ర లింగ యూత్ ఇంచార్జి అరుణ్ రాజ్‌శేఖర్, మాజీ సర్పంచ్‌లు, బిఆర్ఎస్ నేతలు భారతీయ జనతా పార్టీ ఎంపి అభ్యర్థి బిబి పాటిల్ సమక్షంలో ఆదివారం చేరారు. పార్టీలో చేరిన జడ్పీటిసి సభ్యులు, రాష్ట్ర లింగ యూత్ఇంచార్జి, మాజీ సర్పంచ్‌లు సంజురెడ్డి,భూమారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ కిష్టారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ రహీంసాబ్, బాబాసాహెబ్, అమ్సప్ సాబ్ (80 మంది)ని బిజెపి ఎంపి అభ్యర్థి బిబి పాటిల్ బిజెపి కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతం పలికారు.


దగ్ధమవుతున్న అడవీ

### మంబాపూర్ అటవీ ప్రాంతంలో అడవికి నిప్పు

**గుమ్మడిదల, మే 5 ప్రభాతవార్త:** పటాన్‌చెరు నియోజకవర్గం గుమ్మడిదల మండలంలోని మంబాపూర్ గ్రామ పంచాయితీ పరిధిలో ఆదివారం అడవికి దుండగులు నిప్పు అంటించారు. స్థానికుల సమాచారం మేరకు అటవీ శాఖ అధికారులు స్పందించి సకాలంలో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా బీట్ ఆఫీసర్ మంజత్ సింగ్ మాట్లాడుతూ పర్యవరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, అటవీ ప్రాంతం గ్రామాలకు దగ్గరగా ఉన్నందున ఎవరైనా వెళ్లి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. అటవీ ప్రాంతానికి నిప్పు అంటించకుండా జాగ్రత్త వహించాలన్నారు. అడవి నిప్పు అంటించడం సరైన పద్ధతి కాదని, క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ముస్లాపూర్‌లో కారు దగ్ధం

**అల్లాదుర్గం, మే 5, ప్రభాతవార్త:** హైదరాబాద్ నుంచి నాందేడ్ వైపు అకోలా 161వ జాతీయ రహదారిపై వెళుతున్న కారు అగ్నికి ఆహుతైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. మండలంలోని ముస్లాపూర్ గ్రామ శివారులో ప్రయాణిస్తున్న కారు (టిఎస్ 11ఈడి 5325)లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కారు డ్రైవర్ అప్రమత్తతో పెను ప్రమాదం తప్పింది. కారులో ప్రయాణిస్తున్న ప్రయాణీకులు సురక్షితంగా ప్రాణాలతో బయటపడ్డారు. కారులో చెలరేగిన అగ్ని కీలలకు కారు పూర్తిగా కాలిపోయింది. అటుగా వెళుతున్న వాహన చోదకులు విషయాన్ని అగ్నిమాపక సిబ్బందికి చేరవేయగా అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. హైదరాబాద్‌కు చెందిన పంపంగి రమేష్‌కు చెందిన కారుగా గుర్తించామని అల్లాదుర్గం పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.


ముస్లాపూర్ జాతీయ రహదారిపై అగ్నికి ఆహుతి అవుతున్న కారు